సాక్షి
నంద్యాల
ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



రెగ్యులర్ చేయాలి

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ రంగ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. శనివారం ధర్నా నిర్వహించారు. 10లో▸



ముగిసిన ఎల్లార్తి ఉరుసు

ఎల్లార్తి ఉరుసు శనివారం ముగిసింది. షేక్షావలి, షాషావలి స్వామి దర్గాలను దర్శించుకునేందుకు ఇరు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:15,538
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:15,436

న్యూస్‌రీల్

ప్రతిభా విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులకు ప్రోత్సాహక చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలో చదివి నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు కలెక్టర్ రాజకుమారి అభినందించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో వారిని అభినందిస్తూ ఒక్కొక్కరికి రూ.లక్ష ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మకూరు మండలం నందికుంట గ్రామా నికి చెందిన ప్రణయ్‌బాబు, గడివేముల మండలం ఎల్‌కే తండాకు చెందిన నితీస్ నాయక్ చిన్నటేకూరులోని ఏపీఆర్జేసీ స్కూల్‌లో 10వ తరగతి వరకు, అనంతరం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీలో ఇంటర్ చదివారన్నారు. అక్కడే నీట్ కోచింగ్ తీసుకుని మెడికల్ సీట్లు సాధించారన్నారు. ప్రణయ్ బాబుకు తిరుపతి మెడికల్ కళాశాలలో, నితీష్ నాయక్‌కు అనంతపూర్ మెడికల్ కళాశాలలో సీట్లు పొందారన్నారు. ఈనెల 22 నుంచి క్లాసులు ప్రారంభం కానున్నాయని, శ్రద్ధగా చదివి తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌ఓ రామునాయక్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఫిజిక్స్ లెక్చరర్ ఉమామహేశ్వరప్ప విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దసరా సెలవులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందని డీఈఓ జనార్దన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా దసరా సెలవులు ఈనెల 24వ తేదీ నుంచి ప్రకటించిందని, మార్పు చేస్తూ ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు 11 రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. వచ్చే నెల 3న యథావిధిగా పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని తెలిపారు.

దేవరగట్టులో 2న బన్ని ఉత్సవం

హొళగుంద: దేవరగట్టులో దసరా బన్ని ఉత్సవం వచ్చే నెల 2న నిర్వహించనున్నారని, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. దేవరగట్టులో అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలతో శనివారం ఆయన మాట్లాడారు. తేరు బజారు, డొళ్లిన బండెను పరిశీలించారు.

ముగ్గురు ఎంపీడీఓలకు పోస్టింగ్స్

కర్నూలు(అర్బన్): ఇటీవల ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన ఆరుగురిలో ముగ్గురికి పోస్టింగ్స్ ఇచ్చినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్వామాలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న టీ క్రిష్ణమోహన్ శర్మను గూడురు, పాముల పాడు ఏఓ గాయత్రీని బండి ఆత్మకూరు ఎంపీడీఓగా, మహానంది డిప్యూటీ ఎంపీడీఓగా ఉన్న పీ నాగేంద్రుడును ఆత్మకూరుకు పోస్టింగ్ ఇచ్చామన్నారు. పదోన్నతి పొందిన వారిలో పీ దస్తగిరి బాబు, ఎస్ నాగరాజు, రామక్రిష్ణవేణికి ఇంకా పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో కోసిగి, ఓర్వకల్లు, నంద్యాల జిల్లాలో అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లెలో ఎంపీడీఓ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కాగా, పోస్టింగ్స్ కోసం ఎదురు చూస్తున్న ముగ్గురిని కూడా పీఆర్ కమిషనరేట్ నంద్యాల జిల్లాకే కేటాయించింది.

రెండో రోజూ స్తంభించిన రిజిస్ట్రేషన్ సేవలు

కర్నూలు(సెంట్రల్): దస్తావేజు రైటర్ల పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్ సేవలు రెండో రోజూ స్తంభించాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విక్రయదారులు లేక కళ తప్పి కనిపించాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో రోజుకు దాదాపు 500 రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. వాటి ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.30 లక్షల నుంచి 40 లక్షల ఆదాయం వస్తుంది. అయితే దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శనివారం దస్తావేజు లేఖరులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎస్‌ఏ రహమాన్, మహ్మద్ రఫీక్, చంద్రశేఖర్, రామకృష్ణ, నాగరాజు మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పీడీఈ విధానంలో ఉన్న లోపాలను సరిచేయాలన్నారు. నాయకులురాజా, మహేష్, గోపాల్, జగదీష్, భాస్కర్ గౌడ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉల్లి రైతు ఉక్కిరిబిక్కిరి

- రేపటి నుంచి మద్దతు ధరతో కొనుగోళ్లు ఉండవు
- వ్యాపారులకు రూ.50, రూ.100కు అమ్ముకోవాల్సిందే
- ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ.లక్ష పైనే
- పరిహారం కింద రూ.20 వేలు మాత్రమే చెల్లిస్తుందట!
- పెట్టుబడిలో 50 శాతం కూడా దక్కని వైనం
- ఇప్పటికే మిర్చి, పొగాకు రైతులకు తీరని అన్యాయం చేసిన ప్రభుత్వం
- తాజాగా ఉల్లి రైతులకు తప్పని ఇక్కట్లు
- ఇక నిత్యం మార్కెట్‌లో ఆందోళనలు, రాస్తారోకోలు తప్పని పరిస్థితి



కర్నూలు మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ఉల్లి గడ్డలు

జిల్లాలో ఉల్లిసాగు: 50,000 ఎకరాలు / ఇప్పటి వరకు కోసింది: 5,000 ఎకరాలు

కోయాల్సిన పంట: 45,000ఎకరాలు / ఎకరాకు నగటున దిగుబడి: 60 క్వింటాళ్లు

రానున్న రోజుల్లో వచ్చే దిగుబడి: 27 లక్షల క్వింటాళ్లు

మద్దతు ధరతో కొంటే ప్రభుత్వంపై పడే భారం: రూ.324 కోట్లు

ఎకరాకు రూ. 20,000 ఇవ్వడం వల్ల పడే భారం: రూ.90 కోట్లు

ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అనే ప్రకటన చేసింది.

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం విరుద్ధ ప్రకటనలు చేస్తూ ఉల్లి రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. క్వింటా ఉల్లి మద్దతు ధర రూ.1,200 ప్రకటించి, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే ఈ విధానానికి 20 రోజుల్లోనే స్వస్తి పలికారు. ఎకరాకు పరిహారం కింద రూ.20 వేలు చెల్లిస్తామని చెబుతున్నారు. గతంలో కూడా మిర్చి, పొగాకుకు మంచి ధర ఇస్తామని చెప్పి రైతులను ఊరించి.. ఉసూరుమనిపించారు. ఇప్పుడు ఉల్లి రైతుల పరిస్థితి కూడా అదే విధంగా ఉంది.

దయనీయం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1,200 గిట్టుబాటు కాకపోయినప్పటికీ ఉల్లి రైతులు సర్దుబాటు చేసుకుంటూ వచ్చారు. ఉన్నట్టుండి మద్దతు ధరతో ఉల్లి కొనుగోళ్లకు స్వస్తి పలకడంతో ఆందోళన నెలకొంది. ఎకరా ఉల్లి సాగుకు పెట్టుబడి వ్యయం రూ.లక్ష పైనే ఉంటోంది. కొందరు బంగారు నగలు తాకట్టుపెట్టి, రూ.2 వడ్డీతో అప్పులు తెచ్చి ఉల్లి సాగు చేశారు. అధిక వర్షాలతో 30 శాతం దిగుబడులు తగ్గిపోయాయి. ఈ సయంలో క్వింటాకు రూ.2,000 ధర లభిస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం రూ.1,200 మద్దతు ధరతో కొంటున్నా రైతులకు పెట్టుబడి కూడా దక్కడం లేదు. తాజాగా మద్దతు ధరను ఇవ్వబోమని, పరిహారం ఇస్తామని కొత్త పల్లవి అందుకోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

దళారులే దిక్కు

వ్యాపారులు కొనిన ధరలో వ్యత్యాసం మొత్తాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా చెల్లించేందుకు శనివారమే చివరి రోజు. వ్యాపారులు కొనగా.. మిగిలిపోయిన లాట్లను కూడా మార్క్‌ఫెడ్ తీసుకోలేదు. ఇప్పటికే ప్రతి ఎకరాలో కనీసం 20 క్వింటాళ్ల ఉల్లిని పారబోశారు. మార్కెట్‌లో క్వింటా రూ.50, రూ.100 ప్రకారం ధర లభిస్తోంది. ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేలు పరిహారం ఇచ్చినా గిట్టుబాటు కాదని రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 22 నుంచి కర్నూలు మార్కెట్‌కు తెచ్చిన ఉల్లి దళారుల పాలేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నాణ్యత లోపం పేరుతో సగం లాట్లకు వ్యాపారులు టెండరు వేయడం లేదు. ఇప్పటి వరకు రోజుకు రెండు సార్లు టెండరు ప్రక్రియను నిర్వహించినప్పటికీ 40 శాతం లాట్లు మిగులుతున్నాయి. టెండరు పడని లాట్లను రైతులు వెనక్కి తీసుకెళ్లాల్సి ఉంది. లేదంటే దళారీలకు రూ.30, రూ.50, రూ.100 కు అమ్ముకోవాల్సిందే. గిట్టుబాటు ధర కోసం ఇక నిత్యం కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు రాస్తారోకోలు, ఆందోళనలు చేయాల్సిందే!

రేపటి నుంచి మద్దతు కొనుగోళ్లు లేవు



ఈ నెల 22 నుంచి మార్కెట్ యార్డులో మద్దతు ధరతో ఉల్లి కొనుగోళ్లు ఉండవు. ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేల ప్రకారం పరిహారం చెల్లించే విధంగా నిర్ణయించింది. రైతులు పొలంలోనే గ్రేడింగ్ చేసుకొని తెస్తే ధర లభిస్తుంది. వ్యాపారులు టెండరు వేస్తారు. నాణ్యత లేక పోతే వ్యాపారులు టెండరు వేయరు. సరుకును వెనక్కి తీసుకెళ్లాల్సి ఉంది.

– జయలక్ష్మి, మార్కెట్ కమిటీ సెక్రటరీ, కర్నూలు

మార్గదర్శకాలు ఏవీ?

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఉల్లి దిగుబడులు నవంబరు నెల చివరి వరకు వస్తాయి. ఎకరాకు రూ.20 వేలు పరిహారం ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ మార్గదర్శకాలు ఇవ్వలేదు. పెట్టుబడి వ్యయాన్ని, అధిక వర్షాలతో జరిగిన నష్టం... ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ధరలను పరిగణనలోకి తీసుకొని ఎకరాకు రూ.40 వేలు, అంతకంటే ఎక్కువ పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం పెంచాలి



మేము రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాం. ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ.లక్షపైనే వచ్చింది. ఎకరాకు దిగుబడి 50 క్వింటాళ్లు మించడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌కు 60 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు తీసుకువచ్చాం. నాణ్యత లేదని ఉల్లిగడ్డలను వ్యాపారులు టెండరు వేయలేదు. ఆదివారం మళ్లీ టెండరు పెడుతామని అధికారులు చెబుతున్నారు. వ్యాపారుల తీరు చూస్తే క్వింటాకు రూ.100, 150 కూడా ధర వేసే పరిస్థితి లేదు. పెట్టుబడి వ్యయాన్ని బట్టి ప్రభుత్వం పరిహారం చెల్లించాలి. ఎకరాకు కనీసం రూ.40 వేల వరకు పరిహారం ఇవ్వాలి.

– మస్తాన్‌వలీ, తడకనపల్లి, కల్లూరు మండలం

రూ.429 ధరతో కొన్నారు



ఈ సారి ఖరీఫ్‌లో ముక్కాల్ ఎకరాలో ఉల్లి సాగు చేశా. పెట్టుబడి రూ.80 వేల వరకు పెట్టా. 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీనిని మార్కెట్‌కు తీసుక వస్తే వ్యాపారులు క్వింటా రూ.429 ధరతో కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పరిహారం ముక్కాల్ ఎకరాకు రూ.15వేలు వస్తుంది. అంటే రైతుకు దక్కుతున్న మొత్తం రూ.45 వేలు మాత్రమే. పెట్టుబడిలో 50 శాతం మాత్రమే దక్కుతుంది. ప్రభుత్వం పెట్టుబడి వ్యయాన్ని బట్టి పరిహారం ఇవ్వాలి.

– వీరేష్, చిన్న కొతిలి, నందవరం మండలం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలోని వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ బాధ్యతయుతంగా పనిచేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మణిరెడ్డి శనివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పదవులు వరిస్తాయన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పదవులు పొందిన వారందరూ సమన్వయంగా, సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మికాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శివారెడ్డి, ఎ. గోకులపాడు గ్రామ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రోగిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గోస్పాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వైద్య సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లెల్లలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావునాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబాలు శక్తి వంతంగా ఉంటాయన్నారు. గర్భిణులు, కౌమార బాలికలు ఆరోగ్య విషయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

‘అనకొండ’ అవినీతిపై నత్తనడకన విచారణ

- తవ్వేకొద్ది వెలుగు చూస్తున్న అక్రమాలు
- సిబ్బంది ప్రమేయంతోనే భారీగా నిధుల స్వాహా
- స్కామ్‌లో తెరపైకి పలువురి ఉద్యోగుల పేర్లు
- చర్యలు తీసుకోవడంలో అధికారుల జాప్యం



ఆత్మకూరు అటవీ శాఖ డీడీ కార్యాలయం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ప్రభుత్వ నిధులు స్వాహా కేసులో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులో స్థానిక డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో పని చేసి రిటైర్డ్ అయిన కార్యాలయ పర్యవేక్షణాధికారి చాంద్‌బాషా ప్రధాన నిందితుడిగా తేల్చి అరెస్ట్ చేశారు. అక్రమాలు మొదట రూ.4 కోట్లుగా నిర్ధారణ చేసి విచారణ చేపట్టగా మరో రూ. 3 కోట్ల మేర బయటపడినట్లు సమాచారం. ఈ కేసులో జరిగిన లావాదేవిలను అటవీశాఖ విజిలెన్స్ డీఎఫ్‌వో శివప్రసాద్ బృందం విచారణ చేస్తుండగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధాన నిందితుడు చాంద్‌బాషా అటవీశాఖలో పని చేస్తున్న పలువురు మినిమం టైం స్కేల్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కొందరు ఏబీవోలు, ఎఫ్‌బీవోల సహకారాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. నిధుల స్వాహాలో పలువురి ఉద్యోగుల పేర్లు తెరపైకి వచ్చినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తుండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమార్కుడికి సహకరించిన కొందరు ఉద్యోగులు దర్జాగా విధులు నిర్వహిస్తుండటం గమనార్హం.

విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలు..

- డీడీ కార్యాలయంలో కంప్యూటర్ విభాగంలో పని చేసే ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రెండు బ్యాంకు అకౌంట్లలోకి ప్రధాన నిందితుడు వేతనాల పేర్లతో మూడు సార్లు నిధులు మళ్లించుకున్నట్లు బ్యాంకు స్టేట్‌మెంట్లు తెలుపుతున్నాయి. ఈ లెక్కన ఆయన నెలకు మూడు వేతనాల చొప్పున డ్రా చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇలా దారి మళ్లిన సొమ్ము ప్రధాన నిందితునికి చేరిందా లేకా అన్ని అంశాలలో సహకరించిన ఉద్యోగికి అనకొండ అందించిన నజరానా అనే సంగతి తెలియాల్సి ఉంది.
- మినిమం టైం స్కేల్ ఉద్యోగి ఒకరు తన పరిధిలో ఉన్న వన సంరక్షణ సమితికి కేటాయించిన సొమ్మును నేరుగా చెక్కుల రూపంలో ప్రధాన నిందితుడి సోదరుడి ఖాతాకు మళ్లించినట్లు రికార్డులు చెబుతున్నాయి.
- ఒక ఏబీవో, ఏబీవోలకు కూడా డీడీ కార్యాలయ బ్యాంకు అకౌంట్ నుంచి పెద్ద మొత్తం బదిలీ చేసి, తిరిగి ఆ మొత్తం అనకొండ సంబంధీకుల ఖాతాలకు జమ చేసినట్లు సమాచారం.
- ఆత్మకూరు డివిజన్‌లో ఉన్న ఒక ఎఫ్‌ఆర్‌ఓ జీపు డ్రైవర్‌గా పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఖాతాలోకి ఆయన వేతనం కాకుండా పలుమార్లు పెద్ద మొత్తాలు బదిలీ అయినట్లు వెలుగు చూసింది. ఆ మొత్తం తిరిగి ఫోన్‌పే ద్వారా ఈ కేసులో ప్రధాన నిందితుడి సూచనల మేరకు ఇతర అకౌంట్లకు బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు.
- బైర్లూటీ ఎకో టూరిజం రిసార్ట్‌లో పనిచేసే ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఖాతాలకు కూడా వనసంరక్షణ సమితిల నుంచి చెక్కుల రూపంలో పెద్ద మొత్తం జమ అయినట్లు విచారణలో తెలిసినట్లు సమాచారం.
- అటవీ నిధుల స్వాహాలో తెరపైకి పలువురి ఉద్యోగుల పేర్లు వెలుగులోకి వస్తున్నా విచారణ నత్తనడకన కొనసాగుతుండటం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

వజ్రాన్వేషణకు వచ్చి.. వరదనీటిలో చిక్కుకుని..



తాళ్లసాయంతో వంకలో నుంచి బయటికి వస్తున్న బాధితులు



మహానందిలో నేలకూలిన భారీ వృక్షం

- తాళ్ల సాయంతో ప్రాణాలు కాపాడిన స్థానికులు

మహానంది: నల్లమలలోని సర్వనరసింహ స్వామి ఆలయ సమీపంలోని వజ్రాలవంక(వాగు)లో వజ్రాల అన్వేషణకు వచ్చిన వారిలో ముగ్గురు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. నల్లమలలో భారీ వర్షం కురవడంతో నీటిప్రవాహం అధికమైంది. వాగులో గుంతల లోతు తెలియని పలువురు వజ్రాన్వేషణకు వెళ్లగా గుంతల్లో పడ్డారు. వారిలో కొందరు మహిళలు, పురుషులు బయటికి రాగా ఒంగోలుకు చెందిన చిన్నయ్య, మరో ఇద్దరు ఈత రాకపోవడంతో చెట్టెక్కి కేకలేశారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆంజనేయపురం గ్రామస్తులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి తాళ్ల సాయంతో ముగ్గురిని ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు.

నేలకూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు..

శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దేవస్థానం పాత కార్యాలయం ముందు ఉన్న సుమారు వందల ఏళ్ల నాటి భారీ చింత వృక్షం నేలకొరిగింది. అదృష్టవశాత్తూ అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇదే చోట నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. నల్లమల అడవిలోనూ భారీ వర్షం కురవడంతో మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలోని ఎంసీ ఫారం గ్రామం వద్ద ఉన్న పాలేరు వారు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ రమాదేవి, విద్యుత్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రయాణికులకు పలు సూచనలు చేశారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

నంద్యాల(అర్బన్): జిల్లాను వర్షాలు వీడటం లేదు. పది రోజులుగా మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా రుద్రవరంలో 40.2 మి.మీ, అత్యల్పంగా వెలుగోడు, బనగానపల్లె మండలాల్లో 1.0 మి.మీ వర్ష పాతం నమోదైంది. మహానందిలో 29.2, సంజామల 25.2, నంద్యాల అర్బన్ 19.6, ఉయ్యాలవాడ 19.4, గోస్పాడు 15.0, శిరివెళ్ల 11.0, ఆళ్లగడ్డ 10.0, కొత్తపల్లె, నంద్యాలరూరల్ 8.6, కోవెలకుంట్ల 6.2, దొర్నిపాడు 4.8, కొలిమిగుండ్ల, చాగలమర్రి 4.6, బండిఆత్మకూరు 3.0, మి.మీ వర్ష పాతం నమోదైంది. కోవెలకుంట్ల – జమ్మలమడుగు రహదారిలో గోవిందపల్లె సమీపంలో చెరువు ఉప్పొంగడంతో నీటి ప్రవాహంలో ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు నిలిచిపోయింది. 30 మంది ప్రయాణికులను పోలీసులు జేసీబీ ద్వారా ఒడ్డుకు చేర్చారు.

మహిళ ప్రాణాలు కాపాడిన హెడ్ కానిస్టేబుల్

మహానంది: భర్తతో గొడవపడి ఆవేశంలో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తున్న ఓ మహిళను పోలీసు కాపాడారు. నంద్యాల – మహానంది మార్గంలో చెరువు వద్ద శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. నంద్యాల పట్టణానికి చెందిన ఓ మహిళ ఇంట్లో భర్తతో గొడవపడి చిన్న చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడేందుకు నిర్ణయించుకుంది. చెరువు సమీపంలో ఓ చికెన్ సెంటర్ ఎదురుగా ఆందోళనతో తడ్పాడుతున్న మహిళను చూసిన స్థానికులకు అనుమానం వచ్చింది. దీంతో మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదే సమయంలో విధుల నిమిత్తం మహానంది వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ కిషోర్‌కుమార్‌ను ఆపి విషయం తెలిపాడు. అప్పటికే ఆమె చెరువు వద్దకు వెళ్లి దూకేందుకు సిద్ధంగా కాగా కిషోర్‌కుమార్ గట్టిగా కేకలు వేసి నిలువరించాడు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి వెనక్కు తీసుకొచ్చాడు. అనంతరం ఆమె భర్తకు సమాచారం అందించగా ఆయన రావడంతో ఆమెను అప్పగించాడు. హెడ్ కానిస్టేబుల్‌తో పాటు సమాచారం ఇచ్చిన ప్రయాణికుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వారి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించినట్లు స్థానికులు తెలిపారు. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డితో పాటు మహానంది పోలీసు సిబ్బంది కిషోర్‌కుమార్‌ను అభినందించారు.

స్వచ్ఛ నంద్యాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



మొక్కలు నాటుతున్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి, చైర్ పర్సన్ మాబున్నిసా

బొమ్మలసత్రం: స్వచ్ఛ నంద్యాల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ శివారులోని డంప్ యార్డులో మంత్రితో పాటు కలెక్టర్ రాజకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ శేషన్న మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. అన్ని కార్యాలయాల్లోని అధికారులు తమ సమీపంలోని చెత్తను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ నంద్యాల కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. జిల్లాలోని 529 ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నంద్యాల పట్టణంలో 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డంపింగ్ యార్డులో ఆరు ఎకరాల్లో 500 మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

శిరివెళ్ల: ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన హమాలీ బోయ గని తిమ్మరాజు (46) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. తిమ్మరాజుకు భార్య సావిత్రి, ఇద్దరు కుమారులు ఉన్నారు. హమాలీ పని చేసే ఇతను సమీప బంధువు యాళ్లూరుకు చెందిన ఓ మహిళతో కొంత కాలం నుండి సహజీవనం సాగిస్తున్నాడు. ఎక్కువగా అక్కడే ఉంటున్నాడు. కాగా ఆ మహిళపై కూడా అనుమానం రావడం, మద్యం, చెడు అలవాట్లతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ విషయాన్ని స్నేహితులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన వారు చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక..

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్‌కు చెందిన చంద్రశేఖర్ అలియాస్ శేఖర్(50) అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన శేఖర్ కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయానికి సంబంధించి ఫైనాన్స్‌లో ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ప్రతి నెలా ట్రాక్టర్‌కు కంతు చెల్లించాల్సి రావడం, వ్యవసాయానికి పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. తీసుకున్న అప్పులు చెల్లించాలని అప్పుదారులు ఒత్తిడి చేయడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి: మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన రైతు ఆనంద్ శనివారం సాయంత్రం తన ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పనులకు వెళ్లిన కుటుంబ సభ్యుల్లో సాయంత్రం ఇంటికి వచ్చిన రైతు సోదరుడు అపస్మారక స్థితిలో ఉన్న తమ్ముడిని చూసి హుటాహుటిన వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యా యత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

బండి ఆత్మకూరు: గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఈర్నపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు. గ్రామానికి చెందిన బత్తుల కేశవ (28)కు భార్య స్వరూప, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కాగా ఇటీవల స్వరూప భర్తతో గొడవ పడి పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపంతో చెందిన కేశవ శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల 'నడక' యాతన


టైర్లు పగిలి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు


హొళగుందకు నడిచి వెళ్తున్న విద్యార్థులు

- టైర్లు పంక్చరై, పగిలిపోయి నిలిచిన ఆర్టీసీ బస్సు
- పరీక్షలు రాయలేకపోయిన విద్యార్థులు

హొళగుంద: టైర్లు పంక్చరై, పగిలిపోయి ఆదోని డిపో బస్సు ఆగిపోవడంతో దాదాపు 50 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలూరు నుంచి సుళువాయి మీదుగా తిరుగుతున్న ఆర్టీసీ బస్సులో శనివారం విరుపాపురం, సుళువాయి, పెద్దహ్యాట, సమ్మతగేరి, ముగుమానుగుందికి చెందిన 50 మంది ఎక్కారు. వీరు హొళగుందలోని జెడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాలకు వెళ్లాల్సి ఉంది. అయితే పెద్దహ్యాట క్రాస్ వద్దకు చేరిన బస్సు వెనుక టైరు పంక్చర్ అయ్యింది. అలాగే ముందు టైరు పగిలిపోయింది. దీంతో బస్సు అక్కడే నిలబడిపోయింది. అందులో ఉన్న విద్యార్థులు దాదాపు నాలుగు కిలోమీటర్ నడిచి హొళగుందకు చేరుకున్నారు. వేళకు చేరుకోకపోవడంతో ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలు రాయలేకపోయామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



• గొర్రెల మేతగా ఉల్లి పంట

ఉల్లి పంటను గొర్రెలకు మేతగా వదిలేసిన ఈ దృశ్యం సి.బెళగల్ గ్రామ సమీపంలో శనివారం కనిపించింది. రైతు కురువ నాగన్న తన రెండు ఎకరాల పొలంలో ఉల్లి సాగు చేశాడు. పంట చేతికి రావడంతో ఉల్లి కోతకు సిద్ధమయ్యాడు. అయితే మార్కెట్లో ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో అప్పులు అవుతాయని రైతులు ఆందోళన చెందాడు. దీంతో శనివారం రెండు ఎకరాల పొలంలోని ఉల్లి పంటను గొర్రెలకు వదిలేశాడు. ఇన్నేళ్ల కాలంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు అని రైతు కురువ నాగన్న కన్నీటి పర్యంతమయ్యాడు.

– సి.బెళగల్

జామకాయలు తెంపుతుండగా..


మృతిచెందిన యుగంధర్‌నాయక్

ఆత్మకూరు: మండలంలోని ముష్టపల్లె గ్రామంలో ఓ విద్యార్థి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన శివనాయక్, కాంతమ్మ దంపతుల కుమారుడు యుగంధర్ నాయక్ (12) 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఇంటి ముందు ఉన్న జామ చెట్టుపై కాయలు తెంచుతుండగా చెట్టుపై ఉన్న విద్యుత్ సర్వీస్ తీగ తాకడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడిని కుటుంబీకులు హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(సెంట్రల్) : విద్యుత్ రంగ కాంట్రాక్ట్,అవుట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అంజిబాబు, బీమేష్, గౌరవాధ్యక్షుడు పి.నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకముందు సీఐటీయూ కార్యాలయం నుంచి విద్యుత్ భవన్‌కు కార్మికులు ర్యాలీగా వెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి పట్టించుకోవడంలేదన్నారు. కనీస వేతనం రూ.46 వేలు ఇవ్వాలన్నారు. 5వ తేదీ లోపు సమస్యలను పరిష్కరించకపోతే తిరుపతిలో నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

నకిలీ పత్రాలపై విచారణ!

- ఎస్పీకి ఫిర్యాదు చేయనున్న విద్యాశాఖ అధికారులు

కర్నూలు సిటీ: నకిలీ పత్రాలు సృష్టించి క్రిష్ణమూర్తి, నల్లని నాయుడు, సుభాష్ అనే వ్యక్తులు గుంటూరు జిల్లాకు చెందిన పింకీ అనే మహిళకు టీచర్ ఉద్యోగం ఇప్పించారు. ఈ మోసం ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీనిపై విద్యాశాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు. నకిలీ అపాయింట్‌మెంట్ కాపీలో కర్నూలు అర్బన్ ఎంఈఓ సంతకం ఉండడంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ స్పందించారు. ఎంఈఓకు నోటీసులు ఇచ్చి స్పష్టత ఇవ్వాలని కోరారు. దీనిపై ఎంఈఓ స్పందిస్తూ అది తన సంతకం కాదని వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఎంఈఓ కార్యాలయ అటెండర్ మధు స్వయంగా పత్రాలను ఎంఈఓ దగ్గరకు తీసుకపోయి సంతకాలు చేయించినట్లు బాధితురాలు పింకీ స్వయంగా చెప్పారు. దీంతో అటెండర్ మధును డీఈఓ ఆఫీస్‌కి పిలిచి విచారించగా మౌనంగా ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాగా.. నకిలీ పత్రాలు సృష్టించి ఉద్యోగాలు ఇప్పించిన వారిపై, నకిలీ పత్రాలతో స్కూల్‌లో చేర్పించుకున్న ప్రధానోపాధ్యాయుడిపై రెండు రోజుల క్రితమే కర్నూలు ఒకటో పట్టణ పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని విద్యాశాఖ అధికారులు ప్రయత్నించారు. బాధితురాలు రాకపోవడంతో వెనక్కి వచ్చారు. జిల్లా కలెక్టర్ ద్వారా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఇద్దరి కుమార్తెలతో తల్లి అదృశ్యం


నర్సమ్మ (ఫైల్)


నందిని (ఫైల్)


స్వప్న (ఫైల్)

నంద్యాల(అర్బన్): జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలో ఓ మహిళ, తన ఇద్దరు కుమార్తెలు ఈనెల 4వ తేదీ నుంచి కనిపించడం లేదు. నంద్యాల రూరల్ స్టేషన్ ఎస్‌ఐ జాకీర్‌హుసేన్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని విజయనగర కాలనీలో నివాసముంటున్న మరాఠీ కులానికి చెందిన బాషాకు భార్య నర్సమ్మ (46), నందిని (21), స్వప్న(19) ఉన్నారు. ఈ నెల 4వ తేదీ ఉదయం నర్సమ్మ, నందిని, స్వప్నతో పాటు బంధువులు అయిన తులసి, శోభాతో కలిసి సమీపంలోని క్రాంతినగర్ వద్ద వంట చెరకు కోసం వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత నర్సమ్మ, ఆమె పిల్లలు కనిపించడం లేదని వెంట వెళ్లిన ఇద్దరు వెతుకులాట ప్రారంభించారు. కనిపించకపోవడంతో వారి కుటుంబీకులకు విషయం తెలిపారు. రెండు రోజులుగా కుటుంబీకులు చుట్టు పక్కల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో తన భార్య, ఇద్దరు కుమార్తెలు కనిపించడం లేదని ఈనెల 6వ తేదీన బాషా రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఇటీవల పోలీసు పీజీఆర్ఎస్‌లో తన భార్యా పిల్లల ఆచూకీ తెలపాలంటూ బాషా ఫిర్యాదు సైతం చేశారు. తన భార్య పిల్లల ఆచూకీ తెలిస్తే 9000850771,9502917316 సమాచారం ఇవ్వాలని బాషా కోరుతున్నారు. నర్సమ్మ ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు ఆధార్ కార్డులు, పొదుపు డబ్బులు రూ. 17 వేలు డ్రా చేసుకుని వెళ్లినట్లు సమాచారం. భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవలతో మనస్తాపం చెందిన నర్సమ్మ కుమార్తెలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. నర్సమ్మ సొంతూరైన తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట, సమీపంలోని కోదాడా, జగ్గయ్యపేట, తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు. కాగా మిస్సింగ్ కేసుల దర్యాప్తు సమయంలో పోలీసుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఆచూకీ జాప్యమవుతుందని పలువురు విమర్శలు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం


ముబీనా(ఫైల్)

మహానంది: గోపవరం సమీపంలోని సెయింట్ ఆన్స్ దివ్యాంగ వయోజన వసతి గృహంలో ఉంటున్న 36 ఏళ్ల షేక్ ముబీనా శుక్ర వారం నుంచి కనిపించడం లేదని ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. కర్నూలులోని మహబూబ్ బాషా కుమార్తె అయిన షేక్ ముబీనాకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇక్కడ వసతి పొందుతోందన్నారు. ముబీనా వెళ్లే సమయంలో ఆకుపచ్చ, తెల్లటి రంగు కలిగిన చుడీదార్, గులాబీ రంగు చున్నీ ధరించిందన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9121101093కు సమాచారం అందించాలని సూచించారు.

బైకుల దొంగ అరెస్టు


బైకుల దొంగను అరెస్టు చూపుతున్న గోనెగండ్ల పోలీసులు

గోనెగండ్ల: జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు బైకుల దొంగతనలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సీఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన ఉప్పరి వీరేష్ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తర్వాత మద్యం, పేకాట, జూదం తదితర చెడు వ్యాసనాలకు బానిసయ్యాడు. కూలీ పనుల నుంచి వచ్చే ఆదాయం జల్సాలకు, ఖర్చులకు సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించేందుకు బైక్‌ల చోరీని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఇళ్ల ముందు, దేవాలయలు, బస్టాండ్ల దగ్గర పార్కు చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లి వాటిని ఇతరులకు విక్రయించేవాడు. ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడకు చెందిన గొల్ల మధుశేఖర్, బొడ్డువాని పల్లెకు చెందిన చంద్రశేఖర్లు తమ బైక్‌లను గోనెగండ్లలోని శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వామి దేవాలయం దగ్గర ఉంచగా చోరీ గురయ్యాయని గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు పోలకల్ గ్రామానికి చెందిన ఉప్పరి వీరేష్ బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలియడంతో శనివారం పథకం ప్రకారం మాటు వేసి గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్ రోడ్డు దగ్గర అదుపులోకి తీసుకున్నారు. రూ.5లక్షలు విలువ చేసే 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. బైకుల దొంగను పట్టుకున్నందుకు సీఐ విజయభాస్కర్, పోలీసులు దేవరాజు, ఎన్‌టీ కుమార్, కార్తీక్, మద్దిలేటి, కృష్ణనాయక్, మహేంద్రలను డీఎస్పీ భార్గవి అభినందించారు.

దళిత, గిరిజనులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

- ఎస్సీ కార్పొరేషన్ ఎదుట డీహెచ్‌పీఎస్ ధర్నా



ఎస్సీ కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న డీహెచ్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లిస్తు దళిత, గిరిజనులను మోసం చేస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సి. మహేష్, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి వి. నాగరాజు ఆరోపించారు. శనివారం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ ఎదుట డీహెచ్‌పీఎస్ నగర కార్యదర్శి కుమార్ రాజా అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటి పోతున్నా, సబ్‌ప్లాన్ నిధుల గురించి మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దళిత, గిరిజనుల పట్ల చాలా దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ పథకానికి సంబంధించి గత నాలుగేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని లేని పక్షంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ రామచంద్ర, కోశాధికారి సీ కుమార్, ఉపాధ్యక్షురాలు కోటమ్మ, నాయకులు అంజి, రమేష్, శ్రీను, ఏసన్న, వై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంతో ఆందోళన


మృతదేహంతో ఆందోళన చేస్తూ వన్‌టౌన్ సీఐ శ్రీరామ్‌తో మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన మల్లికార్జున మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఆస్పరి మండలం చిరుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లికార్జున మృతిచెందిన విషయం విదితమే. అయితే, మృతుడి వెంట ఆటోలో ఇద్దరు వెళ్లారని, ప్రమాదంలో వారికి ఎలాంటి గాయాలు కాకుండా మల్లికార్జున ఒక్కడే చనిపోవడం నుమానాలురేకెత్తిస్తున్నాయని కుటుంసభ్యులు ఆరోపించారు. కాగా ఆసుపత్రి ఎదుట ఆందోళన విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ అక్కడికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ముగిసిన ఎల్లార్తి ఉరుసు


ఫాతెహాలు చేసేందుకు వెళ్తున్న దర్గా పీఠాధిపతి నూర్‌బాబా ఖాద్రీ

హొళగుంద: ఎల్లార్తి ఉరుసు శనివారం ముగిసింది. షేక్షావలి, షాషావలి స్వామి దర్గాలను దర్శించుకునేందుకు తెలుగురాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చివరి రోజు జియారత్ కార్యక్రమంలో భాగంగా దర్గాల పీఠాధిపతి నూర్‌బాబా ఖాద్రీ ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి భక్తులకు ధర్మ సందేశం ఇచ్చి ఆశీర్వదించారు. ఏపీ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ దిలీప్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

కేఎంసీ అలుమ్ని భవనం కోసం స్థల పరిశీలన


మెడికల్ కాలేజీలో స్థలాన్ని పరిశీలిస్తున్న హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజి అలుమ్ని (పూర్వ విద్యార్థుల సంఘం) భవనం నిర్మాణం కోసం శనివారం స్థల పరిశీలన చేశారు. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, అలుమ్ని సంఘం నాయకులు కలిసి కళాశాలలోని పలు స్థలాలను చూశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ అలుమ్ని వైద్యులు ఈ కళాశాల విద్యార్థులే అని, ఇక్కడ ఏ అభివృద్ధి కార్యక్రమాలైనా ఇక్కడి వైద్యులకే తిరిగి ఉపయోగపడతాయని చెప్పారు. అయితే ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండేలా నిర్మాణ ప్రదేశం ఉండాలని అలుమ్ని సంఘం నాయకులకు సూచించారు. ఈ మేరకు కళాశాలలో చివరగా ఉన్న ఎగ్జామినేషన్ హాలు పక్కనున్న ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అలుమ్ని ప్రెసిడెంట్ డాక్టర్ బి.కుమారస్వామిరెడ్డి, డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ అలుమ్ని భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రెండేళ్ల క్రితమే జీవో విడుదలైందని, ఈ భవన నిర్మాణం అన్నది వైద్యులందరి కోసం అని, ముఖ్యంగా కళాశాల వైద్యులకు మరింత ఉపయోగపడుతుందని చెప్పారు. అందరి సమ్మతితో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మైదానానికి దూరంగా ఉన్న ప్రదేశాన్నే సూచిస్తున్నామని తెలిపారు. ఈ స్థల పరిశీలనలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, ప్రొఫెసర్ డాక్టర్ మాధవీశ్యామల, అలుమ్ని నాయకులు డాక్టర్ రామచంద్రరావు, వైద్యులు పాల్గొన్నారు.